క్లుప్తంగా

మంత్రి రాజాను కలసిన సీఐ మూర్తి


తునిలో మంత్రి దాడిశెట్టి రాజాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రూరల్ సీఐ మూర్తి

తుని: మండలంలోని ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజాను ఇటీవల తుని రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్వీవీ ఎస్ మూర్తి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి రాజాకు సీఐ మూర్తి మొక్క ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న శాంతిభద్రలపై ఇరువురు చర్చించారు. నియోజవర్గ ప్రజలకు మెరుగైన సేవలందించాలని మంత్రి సీఐకి సూచించారు. కార్యక్రమంలో పోతుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

250 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు


కొత్త సూరవరంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కుమార్

తుని రూరల్: మండలంలోని కొత్త సూరవరంలో పుష్ప ప్రాథమిక కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం 250 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు ప్రారంభించారు. డాక్టర్లు 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిని 25 మందిని శస్త్ర చికిత్సలకు రిఫర్ చేశారు. విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో ఈనెల 24న వారికి శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు.

వేదాలను యోగాభ్యాసనకు అనుసంధానం చేయాలి


తునిలో యోగా సదస్సుకు హాజరైన భాస్కరరావు, తదితరులు

తుని: ప్రస్తుత సమాజంలో ప్రతిఒక్కరూ మానసిక ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో వేదాలను యోగాభ్యాసనకు అనుసంధానం చేయాలని ప్రముఖ యోగా గురువు డాక్టర్ భాస్కరరావు అన్నారు. తుని పట్టణం సత్యసాయి మందిరంలో సోమవారం అలయెన్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగా ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలను భాస్కరరావు వివరించారు. సందర్భంగా క్లబ్ సభ్యులు భాస్కరరావును ఘనంగా సత్కరించారు. అలయెన్స్ క్లబ్ కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్, దాసరి నూకయ్యశెట్టి, కుక్కడపు నాగరాజు, కలిదిండి సత్యనారాయణరాజు, కృష్ణ, వేణుగోపాల్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టంపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో సోమవారం భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి దేవర అనూష యాదవ్ అధ్యక్షతన భూహక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ప్రతినిధి బుగత శివ ముఖ్య అతిథిగా పాల్గొని భూహక్కు చట్టం గురించి వివరించారు. ఏపీ ప్రభుత్వం 2022లో తీసుకువచ్చిన భూహక్కు చట్టాన్ని (యాక్ట్ నెంబర్ 27/23) వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం వలన పేదలకు ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బీసీ ఐక్య సంఘర్షణ సమితి నియోజకవ్గ కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, దేవర రమణ, రాళ్ల సీతయ్య, సీహెచ్ బుజ్జి పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వే చేయాలంటూ ధర్నా


తునిలో ర్యాలీ చేస్తున్న లిబరేషన్ నాయకులు, రైతులు

తుని: పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు సమగ్ర భూ సర్వే నిర్వహించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.జనార్దన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తుని మండలం ఎస్ఎస్ వెంకటాపురానికి చెందిన రైతులు గొల్ల అప్పారావు సెంటర్లో ధర్నా నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా భూ సర్వే చేయించి అర్హులకు పట్టాలు పంపిణీ చేయాలని జనార్దన్ కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శివకుమార్‌కు సమర్పించారు. నాయకులు వాడబోయిన శివ, యర్రంశెట్టి అప్పారావు, తాతారావు, జి.తాతారావు, నూకరత్నం, మహాలక్ష్మి పాల్గొన్నారు.


ఏలేశ్వరం రామాలయంలో భజనలు చేస్తున్న మహిళలు


కోటనందూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువత


కుమ్మరిలోవ తపోవనంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పీఠాధిపతి, భక్తులు


జగన్నాథగిరిలో కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఊరూవాడా శ్రీరాముని సంబరం

- రామ నామస్మరణతో మార్మోగిన పల్లెలు
- రామాలయాల వద్ద అన్న సమారాధనలు
- గ్రామాల్లో పండగ వాతావరణం

ఏలేశ్వరం: అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగదళ్ ఆధ్వర్యంలో పలు భజన బృందాలు, మహిళలు, ప్రజలు సంబరాలు చేసుకున్నారు. మహిళలు ఆలయాలు, ఇళ్ల వద్ద దీపాలు వెలిగించారు. రామాలయాలను పూలతో సుందరంగా అలకరించారు. ఏలేశ్వరంలోని పైడిమల్లమ్మ వీధిలోని రామాలయం వద్ద మహిళలు భక్తిపాటలు ఆలపించారు. స్థానిక మార్కెట్ వీధిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద జన కాలక్షేపం నిర్వహించారు. దిబ్బలపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం వద్ద గుమ్మముహూర్తం చేశారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని వినాయకుని ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ నేత సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు. పెద్దనాపల్లి ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు.

శ్రీరాముని ఆదర్శంగా తీసుకోవాలి

శ్రీరాముడిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపులసుబ్బారావు అన్నారు. అయోధ్య రామమందిరంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని లింగంపర్తిలో సోమవారం శోభయాత్ర నిర్వహించారు. వరుపుల పల్లకీమోసి శోభాయాత్రను ప్రారంభించారు. వందలాది మంది భక్తుల నడుమ యాత్ర వైభవంగా జరిగింది. అనంతరం పలు గ్రామాల్లో పర్యటించి పార్టీ శ్రేణులను కలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జై శ్రీరామ్..

తుని రూరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం పల్లెలు, పట్టణాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేద విద్యార్థులు, భక్తులు సీతారాములకు ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ, శాంతి హోమం, భజనలు, ప్రసాద వితరణ చేశారు. ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేసి అయోధ్యలో జరిగిన కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. జగన్నాథగిరి రామాలయం వద్ద కోలాట ప్రదర్శన, ఏకాహం, మహాన్నసమరాధన నిర్వహించారు. సరస్వతీ విద్యా సేవా సమితి వ్యవస్థాపకుడు గొర్లి శివరామకృష్ణ ఆధ్వర్యంలో వెయ్యిమందికి పులిహోర, లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు. ఎస్.అన్నవరం రామాలయంలో భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


లింగంపర్తిలో స్వామివారి పల్లకీ మోస్తున్న వరుపుల సుబ్బారావు

కన్నులపండువగా శోభాయాత్ర

అన్నవరం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం అన్నవరంలో శోభాయాత్ర నిర్వహించారు. వేలాది మంది భక్తులు కాషాయ జెండాలు చేతబూని జై శ్రీరామ్ అని నినాదాలతో శోభాయాత్ర చేశారు. చిన్నారుల కోలాట పదర్శన, మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ శోభాయాత్ర వైభవంగా సాగింది. ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

అంతా రామమయం

తుని: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని పట్టణంలో సోమవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉదయం నుంచి పట్టణంలోని అన్ని ఆలయాలు వద్ద సీతారాముల చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ భక్తులు నినాదాలు చేశారు. బీజేపీ, విశ్వహిందూ పరిషత్, భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరాముని జెండాలతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక గణపతినగర్ పార్కులో సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు అక్షితలు, రాముడు చిత్ర పటాలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం శ్రీరాముని శోభాయాత్రలు నిర్వహించారు. భజన బృందాలు, మహిళలు, భక్తులు శ్రీరాముని జెండాలు చేతబూని జైశ్రీరామ్ నినాదాలతో శోభాయాత్రలో చేశారు. రామాలయాల్లో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

రౌతులపూడి: అయోధ్య రామమందిరంలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రౌతులపూడి, శృంగవరం, గంగవరం, ములగపూడి, ఎస్ఎస్ పట్నం తదితర గ్రామాల్లో సీతారాముల విగ్రహాలతో శోభయాత్ర నిర్వహించారు. మహిళలు ఇళ్ల వద్ద, ఆలయాల్లో దీపాలంకరణ చేశారు.

జగ్గంపేటలో భారీ ఊరేగింపు

జగ్గంపేట: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జగ్గంపేటలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ, విశ్వవిందూ పరిషత్ నేతలు ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. స్థానిక విష్ణాలయం నుంచి పురవీధుల్లో ఊరేగింపు వైభవంగా సాగింది. విష్ణాలయం వద్ద పెద్ద స్క్రీన్స్ ఏర్పాటు చేసి అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని లైవ్‌లో అందరూ తిలకించేలా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త కొత్త భైరవకృష్ణ, బొండా కాశీ, దారా శ్రీనివాస్, ఆర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం మండల వ్యాప్తంగా ఆధ్యాత్మికం సందడి నెలకొంది. గ్రామాల్లో ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించారు. శ్రీరామ నామ స్మరణతో భక్తిని నింపుకొని భక్తజనం ముందుకు కదిలారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో వీధి వీధిన నగర సంకీర్తనలు, సీతారాములకు పల్లకీ సేవ నిర్వహించారు.

పల్లెల్లో పెల్లుబికిన ఆధ్యాత్మికశోభ

కోటనందూరు: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండల వ్యాప్తంగా పల్లెల్లో ఆధ్యాత్మికశోభ పెల్లుబికింది. గ్రామాల్లో రామకీర్తనలు, భజనల నడుమ భక్తులు సీతారాములను పల్లకీల్లో ఊరేగించారు. మండలంలోని కేఎస్ కొత్తూరు రామాలయంలో ఏకాహం, కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. రామభక్తులు కాకరాపల్లి కనకదుర్గ ఆలయం నుంచి మండల వ్యాప్తంగా శోభాయాత్ర నిర్వహించారు.

శంఖవరం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలవ్యాప్తంగా సోమవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. రామాలయాల వద్ద భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తి గీతాలతో భజనలు చేశారు. స్వామి వారిని పల్లకీల్లో బాణసంచా కాల్పుల మధ్య ఊరేగించారు. పలు గ్రామాల్లో రామాలయాల వద్ద అన్నదానం నిర్వహించారు.

కిర్లంపూడి: అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం గ్రామాలు రామనామ స్మరణతో మార్మోగాయి. జగపతినగరం, చిల్లంగి, కిర్లంపూడి రామాలయాల్లో ఏకాహం నిర్వహించారు. గ్రామాల్లో భక్తులు కాషాయ జెండాలతో రామ నామం జపిస్తూ శోభాయాత్రలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు మహిళలు ప్రతి ఇంటిలో రామజ్యోతిని వెలిగించారు.


జగ్గంపేటలో ఊరేగింపు నిర్వహిస్తున్న రామభక్తులు


కొండయ్యపేటలో భజనలు చేస్తున్న మహిళలు


శంఖవరంలో స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు


గోపాలపట్నంలో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు

తొండంగి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ సోమవారం సీతారాముల శోభాయాత్రలు నిర్వహించారు. గోపాలపట్నంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేశారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు.



అన్నవరంలో శోభాయాత్ర చేస్తున్న రామభక్తులు


తుని గణపతినగర్ పార్కులో భక్తులకు అక్షతలు పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు


ధర్మవరంలో శోభా యాత్ర చేస్తున్న రామభక్తులు


రౌతులపూడిలో స్వామివారి శోభాయాత్ర చేస్తున్న భక్తులు

హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయం


హిందూ దేవాలయాల అభివృద్ధికి విరాళం చెక్కు అందజేస్తున్న కంబాల శ్రీనివాస్‌రావు


గోకవరంలో భారీ బైక్ ర్యాలీ

- హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాస్‌రావు
- పలు దేవాలయాలకు రూ.65 లక్షల విరాళం

గోకవరం: హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాస్‌రావు తెలిపారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీఎండీ కేఎస్‌పీపీ ఫిన్స్ లే అవుట్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గణపతి హోమం, సీతారాముల పాదుకా పట్టాభిషేకం నిర్వహించి అఖండ జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ఏడాది కాలంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా హిందూ దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా దేవీ చౌక్ ఆలయంలో కనకదుర్గమ్మకు బంగారు కిరీటానికి రూ.10 లక్షలతో పాటు పలు గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి తనవంతుగా సుమారు రూ.65 లక్షలు వితరణ చేశారు. ఇప్పటి వరకు సుమారు రూ.1.50 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. అనంతరం సుమారు వెయ్యి బైక్‌లు, ఆటోలు, కార్లుతో జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ గోకవరం నుంచి పలు గ్రామాల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. జైశ్రీరామ్ నినాదాలతో మండలం మార్మోగింది. మధ్యాహ్నం సుమారు ఐదు వేల మందికి భారీ అన్నదానం నిర్వహించారు. బైక్ ర్యాలీ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన బెండపూడి సాధువు ఆరాధనోత్సవాలు

తొండంగి: మండలంలోని బెండపూడిలో శ్రీమాన్ పరమహంస చిద్వేంకట రామబ్రహ్మానందమహర్షి (బెండపూడి సాధువు) ఆరాధనోత్సవాలు సోమవారంతో ముగిశాయి. మూడు రోజులపాటు ఆశ్రమంలో మహర్షి నిర్వికల్ప సమాధి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ ప్రాంగణంలో దాదాపుగా యాభైవేల మందికి పైగా అన్నసమారాధన చేశారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి గిరిజనులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

తుని: రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్లున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి 30 ఏళ్ల యువకుడు గుల్లిపాడు–నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్ల మధ్య జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచామన్నారు. మరిన్ని వివరాలకు 94948 87786 నంబరును సంప్రదించాలని ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ కోరారు.

మహిళా ఓటర్లదే పైచేయి

- తుది ఓటర్ల జాబితా విడుదల
- తుని నియోజకవర్గంలో 2,20,877 మంది ఓటర్లు

తుని రూరల్: తుని అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా ఓటర్లదే పైచేయిగా నిలిచింది. సోమవారం ఎన్నికల కమిషన్ తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది. నియోజకవర్గం మొత్తంగా 2,20,877 మంది ఓటర్లు ఉన్నట్టు ఈఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలు తర్వాత 223 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మహిళా ఓటర్లు 1,11,800, పురుషులు 1,09,052, ట్రాన్స్‌జెండర్లు 25 మంది ఉన్నారు. తుని మండలంలో 65,729 మంది, కోటనందూరు మండలంలో 39,090 మంది, తొండంగి మండలంలో 73,671 మంది, తుని పట్టణంలో 42,387 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్లు, సచివాలయాల వద్ద ఓటర్ల జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్టు ఈఆర్వో మూర్తి వివరించారు. ఓటర్ల నిష్పత్తి వెయ్యి మంది జనాభాకు 737 మందిగా ఉందన్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 2,13,639 మంది ఓటర్లు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గ ఓటర్ల లెక్క తేలింది. నియోజకవర్గంలో పురుషుల ఓటర్ల కంటే 2,795 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఓటర్ల తుది జాబితా సోమవారం సాయంత్రం సహాయ ఓటర్ల నమోదు అధికారి, ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ ప్రకటించారు. నియోజకవర్గంలోని 227 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 1,05412 మంది పురుషులు, 1,08,207 మంది స్త్రీలు, ఇతరులు 20 మంది వెరసి 2,13,639 మంది ఓటర్లున్నారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం మండలంలో 36,755 మంది, ఏలేశ్వరం నగర పంచాయతీలో 24,489 మంది, ప్రత్తిపాడు మండలంలో 64,707 మంది, శంఖవరం మండలంలో 45,111 మంది, రౌతులపూడి మండలంలో 42,577 మంది ఓటర్లున్నారని సహాయ ఓటర్ల నమోదు అధికారి, ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ తెలిపారు.

జగ్గంపేట నియోజకవర్గంలో 2,24,943 మంది...

జగ్గంపేట: జగ్గంపేట నియోజకవర్గ ఓటర్ల లెక్క తేలింది. తుది ఓటర్ల జాబితా సోమవారం విడుదలైంది. నియోజకవర్గంలో 248 బూత్‌ల పరిధిలో మొత్తం ఓటర్లు 2,249,43 మంది ఓటర్లు ఉన్నట్టు ఈఆర్ఓ జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. వీరిలో పురుషులు 1,11,211, మహిళలు1,13,720, ట్రాన్స్‌జెండర్స్ 12 మంది ఉన్నట్టు వివరించారు. జగ్గంపేట మండలంలో మొత్తం ఓటర్లు 64912 మంది కాగా పురుషులు 31,932, మహిళలు 32,976, ఇతరులు నలుగురు ఉన్నారు. గండేపల్లి మండలంలో మొత్తం ఓటర్లు 44, 942 మంది కాగా పురుషులు 22, 213 మంది, మహిళలు 22, 728, ఇతరులు ఒకరు ఉన్నారు. కిర్లంపూడి మండలంలో మొత్తం ఓటర్లు 58,917 మంది కాగా పురుషులు 29, 721, మహిళలు 29, 192, ఇతరులు నలుగురు ఉన్నారు. గోకవరం మండలంలో మొత్తం ఓటర్లు 56,172 మంది కాగా పురుషులు 27,345, మహిళలు 28,824, ఇతరులు ముగ్గురు ఉన్నారని ఈఆర్ఓ వివరించారు.


జగ్గంపేటలో తుది ఓటర్ల జాబితా వివరాలను వెల్లడిస్తున్న ఈఆర్ఓ సూర్యనారాయణరెడ్డి

నీలాద్రిరావుపేటలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర


నీలాద్రిరావుపేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గండేపల్లి: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. నీలాద్రిరావుపేటలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ గీతాలు ఆలపించారు. చిన్నారులు కోలాట ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అధికారులు మన సంకల్పం వికసిత్ భారత్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్, వైఎస్సార్ సీపీ నేత కాకి శ్రీను, బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు గారపాటి రాజేశ్వరరావు, మండలాధ్యక్షుడు తోరాటి వెంకన్న, ఎంపీడీఓ రామన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. అయోధ్యలోని బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ శుభగడియాల్లోనే ఈ ప్రతిష్ఠ మహోత్సవం జరగడం విశేషం. గ్రామానికి చెందిన నేతల అప్పారావు దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించి ఆంజనేయస్వామి విగ్రహాన్ని సమకూర్చారు. పండితుల మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేలాదిగా భక్తులు ఆంజనేయస్వామిని దర్శించి తరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నేతల అప్పారావు ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కాకరాపల్లిలో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం

ఎయిడ్స్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

జగ్గంపేట: గ్రామంలోని ఎయిడ్స్ బాధితులకు సోమవారం జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు నూతనపాటి అప్పలకొండ మాట్లాడుతూ విదేశాల్లోని సంఘ సభ్యుల సహకారంతో బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశామన్నారు. ఎయిడ్స్ బాధితులకు అందరూ సహకరించాలని కోరారు.